పార్థసారథికి కోపం, కసి క్రమక్రమంగా పెరుగుతుంటాయి.

అలాగే ఆరోజు భయంకరమూ, ప్రమాదకరమూ అయినప్పటికీ చాలా సరదానిచ్చేదైన సీటుకి ఎదురుగా అతని కళ్ళముందరే వచ్చి నలుగురు కూర్చుండవలసిన సీట్లు కలిపి, దుప్పటిపరిచి బెర్తులా చేసుకుని గుర్రుపెట్టడం మొదలెట్టిన షావుకారిని చూసేటప్పటికి పార్థసారథికెక్కడలేని ఉక్రోషమూ వచ్చింది.

ఆ షావుకారు నిద్రపోతున్నప్పుడు పార్థసారథి దృష్టి అతని పొట్టమీద పడింది. సజీవంగా ఉన్న కొండలా.. ఊపిరి తీసినప్పుడల్లా పైకీ, కిందకీ కదుల్తుండడమే కాక బోర్లించిన బిందెలో టపాకాయ పెట్టి కాలిస్తే బిందె తుళ్ళి తుళ్ళిపడినట్టు పెద్దగురక రాగానే ఆ పొట్ట ఎగిరెగిరి పడుతోంది.

అతను నిద్రపోని టైములో కూడా పార్థసారథి దృష్టి అతని పొట్టమీదకే కేంద్రీకృతమై ఉంది.

ఆ షావుకారికి తినడానికీ, నిద్రపోడానికీ స్వాతంత్ర్యం లేదని పార్థసారథి అనడు. కాని నలుగురు కూర్చోవలసిన సీట్లు ఆక్రమించి నిద్రపోవడమూ, నిద్రపోని కాలంలో వీరమతం వేసుకొని చుట్టూ వున్న వాళ్ళని పులుకూ పులుకూ చూస్తూ గుటూకూ గుటుకూమని మింగడం చూస్తే పార్థసారథికి మొదట తలదాచుకోవటానికి చోటు అడిగి ఇల్లంతా ఆక్రమించిన ఒంటే, వంటింట్లో దూరిపోయి తరిమేలోపునే దొంగ చూపులు చూస్తూ ఆబగా పెరుగో, పాలో తాగేసే పిల్లి జ్ఞాపకం వస్తున్నాయి.

ఇలాంటి వాళ్ళవల్లనే ఆహార సమస్య దేశాన్ని పీడిస్తూందనీ, ఇలాంటి సోమరుల వల్లనే నిరుద్యోగ సమస్య దేశంలో లేదేమో అనుకునే ప్రమాదం వుందనీ పార్థసారథికి అనిపించింది. ఆ షావుకార్ని నట్టడివిలోకి తీసుకుపోయి ఓ చెట్టుక్కట్టి ఆహారం తీసుకోవడం గురించీ, నిద్రపోవడం గురించీ మొదట చెప్పి తర్వాత ఆరోగ్య సూత్రాలూ, ఆ పిమ్మట దేశ పరిస్థితులను గురించి పాఠం చెప్పేసి, ఈలోగా అతను విననట్టుగా కనిపిస్తే కొరడాతో ఛెళ్ళుఛెళ్ళు

మనిపించాలని పార్థసారథికి కోరిక కలిగింది.

చరచరా పాకిపోతున్న పాము పాముల పుట్టను చూసి చప్పున ఆగినట్టుగా ఏదో స్టేషను వచ్చేసరికి ట్రైను ఆగింది. అది పాముల పుట్టకాదు చీమల పుట్ట అన్నట్టుగా రకరకాల తినుబండారాలు అవీ అమ్మేవాళ్లు చీమల్లా ఒక్కసారిగా ట్రైను మీద పడ్డారు.

అంతవరకూ కోడిలా కునుకు తీసిన షావుకారు "ఏయ్ జీడిపప్పూ" అంటూ బొంగురు గొంతుతో కిటికీలో తలపెట్టబోయి, దూరకపోతే చెయ్యి పెట్టి పిలిచేడు. జీడిపప్పువాడికి డబ్బులివ్వడానికి లాల్చీ జేబులోనుంచి పర్సుతీసి లోపలినోట్లు ఎవరెక్కడ చూసేస్తారోనని కళ్లు మిటకరించుకుని చుట్టూ చూస్తూ అతడికి డబ్బులిచ్చేడు షావుకారు. కాని అది పార్థసారథి కంటబడటమూ, రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇక్కడ చిక్కడిపోయిందా అనుకోవటమూ కూడా జరిగింది.

ఒక్కసారి "బుస్స్"మని కేకపెట్టి చీమల్లాంటి అమ్మకందార్లని దులపరించుకుని కదిలింది ట్రైను.

పరువంతో నిండిన పడుచులాగానూ, పళ్ళతో నిండిన కల్పవృక్షం లాగానూ షావుకారి పర్సు పార్థసారథి కళ్ళల్లో కదలాడుతోంది- అంచేతను మరి షావుకారు కనిపించడంలేదు. అతడి విపరీతమైన మనుషుల్ని తినే ఆకలీ కనిపించడంలేదు. ఇంక పాముల్ని మింగేసినట్టు పొట్టచేసే బుస్సమనే గురకలూ వినిపించడంలేదు. విలువిద్యా ప్రవీణుడికి గురి ఒక్కటి మాత్రమే కనిపించి మిగతావి కనిపించనట్టుగా షావుకారి పర్సు మాత్రమే పార్థసారథి కళ్ళల్లో కనిపిస్తూంది. పర్సు దానిలోని డబ్బూ కళ్ళలో మెదుల్తుండగా ఆలోచిస్తున్న పార్థసారథి మెదడు చాలా విషయాలు తర్కించింది.

ఆ పర్సుగాని దానిలోని డబ్బుగాని లేకపోయినంత మాత్రాన షావుకారికి పోయేదేమీ వుండదు. ఆ మాటకొస్తే అతని ఆస్తంతా ప్రజలకి పంచేసినా అతనికి లోటుండదు. సముద్రంలోని రత్నాలూ, ముత్యాలూ, చేపలూ,

జంతువులతోపాటు ఉప్పును కూడా తీసేసినా నష్టమేమీ లేకపోగా స్వచ్ఛమైన నీరు మిగిలిపోయినట్టుగా అతని శరీరానికీ, మనసుకీ, ఎంతో ఆరోగ్యం చేకూరుతుంది కూడాను. పైగా ఎన్ని వెధవపన్లుచేసి, వడ్డీలకి తిప్పి, ఎంత మంది మంగళసూత్రాలు తాకట్టుపెట్టుకుని ఈ డబ్బు సంపాదించేడో! అంచేతనే ఎవడు చూసేస్తాడోనని బెంగ. అలాంటి వాళ్ళని దోచుకోవడమే లోక కళ్యాణం.

ఇకపోతే పర్సూ, అందులోని డబ్బూ తనలాంటివాడి స్వంతమైతే ఎంతో కరువుతీరుతుంది. కొంతమట్టుకైనా అప్పులు తీరతాయి. కొన్నాళ్ళపాటైనా తనూ, భార్యాపిల్లలూ కడుపునిండా తింటారు. ఎన్నాళ్ళనుంచో సరియైన బట్టల్లేవని విచారిస్తుండే తన కుంటుంబానికి మాన మర్యాదలు కాపాడుకోడాని కింత గుడ్డ దొరుకుతుంది. ఇంటివాడి రెణ్నెల్ల అద్దె బాకీ తీరుతుంది. చంటిదానికి రెణ్నెల్లు సరిపడా పాలడబ్బాలు కొనడం జరుగుతుంది. బజార్లో దొరికితే, పలకమాత్రమే ఉండే పెద్దాడి సంచి పుస్తకాలతో నిండుతుంది. లంచవర్‌లో మంచినీళ్ళు మాత్రం తాగి అలా తిరిగొచ్చేసే తనకి టిఫినో, కాఫీయో తాగే స్తోమత కలుగుతుంది. పెళ్ళానికి కొన్నాళ్లపాటు ఇరుగింటికీ, పొరుగింటికీ అప్పుకోసం వెళ్ళే పని మిగుల్తుంది. అన్నింటికంటె ముఖ్యంగా ఇంగువ అయిపోయినా వాసన మిగిలిన డబ్బాలాగా ఇన్నాళ్ళ 'దర్జా' చూపించి 'లాకేత్వం దాక్కొమ్మూ' కాకుండా మరి కొన్నాళ్ళపాటు అప్పులు సంపాదించుకోవచ్చు.

అవసరానవసరాల గూర్చి ఆలోచించిన మీదట మొగ్గు చూపించిన మనసు సాధ్యాసాధ్యాల మీదికి పోయింది.

తాలూకాఫీసులో తనసీటు డిస్పాచింగే అయినప్పటికీ అందరితో కలసిమెలసి ఉండటమూ, మంచనిపించుకోవడమూ, సక్రమంగానూ, సకాలంలోనూ అన్నీ డిస్పేచ్ చేసెయ్యడమూ తన సామర్థ్యమే అని పార్థసారథి ఖచ్చితంగా చెప్పగలడు. అంతేకాదు ఏ సీటులో వేసినా "దొరక్కుండా దొంగతనం" చేయగలనని ఢంకా మీద దెబ్బకొట్టి మరీ చెప్పగలడు. పోతే

అధికారుల మెప్పు సంగతా? ప్రభుత్వ కార్యాలయాల్లో అందునా తాలూకాఫీసులో గొడ్డు చాకిరీ చేసినవాళ్ళకి సైతం అధికారులు తిట్లేమెడల్స్‌గా ఇస్తారు. అంచేత మరి తన తెలివితేటలతో పర్సు స్వంతం చేసుకోగలననే అతని ధీమా. ఇక షావుకారి సంగతి చూద్దామా అంటే లేచి కూర్చోవడమే గగనం. దొంగని పట్టుకునేంత చురుకుదనమెక్కడిదీ? పైగా తిండితినని సమయాల్లో నిద్రావస్థలోనే ఉంటాడాయె.

ఒక్క పార్థసారథి తప్ప ఇంటా బయటా, కొంతమంది అతని వెనకా, కొందరు అతని ముందూ అతని అసమర్థత గురించి చెప్పుకుంటూనే ఉంటారు. "నీ దస్తూరీ అద్భుతంవాయ్" అని అతని మొఖం మీద అనేవాళ్లే, "వాడి మొహం ఆఫీస్ లెటర్స్ సరిగా పంపించలేనివాడికి ఈ సెక్షన్ అనవసరం. మరింకో సెక్షన్లోకి మారిస్తే పనికి రెండు పన్లే" అని వెనకాల చెప్పుతుంటారు. చివరికి వాళ్ళావిడ కూడా "ఊఁ. సర్లే. ఈయన పనివాడితనమే చెప్పుకోవాలి... లేతవి చూసి ఎంచి వంకాయలు తీసుకురండని బజారుకి పంపితే నేను మరీ మరీ చెప్పినందుకేమో అన్నట్టుగా తెస్తారు వంకాయలు పుచ్చువీ, ముదురువీనూ" అంటూ మూతి మూడు వంకర్లు తిప్పుతుంది. పార్థసారథి సామర్థ్యం సంగతలా వుంచితే ఆ షావుకారు చూడ్డానికి తిండిపోతూ, నిద్రపోవడానికి సోమరిపోతూ లాగానే వున్నాడుగాని జేబులోని పర్సునీ, సామాన్లనీ ఓ కంట కనిపెడుతూనే వున్నాడు. అంతెందుకూ అతడు ఆక్రమించుకున్న సీటు చివరగా కూర్చోవడంగాని, కిందని అతని సామాన్ల ప్రక్క ఎవరైనా వెళ్లి సామాన్లని పెట్టడం గాని చేయబోతే ఘోరంగా భయంకరమైన గొంతుతో కరవరావడం చూస్తూంటే పార్థసారథికి గుండె గతుక్కుమంటున్నది.

అకస్మాత్తుగా వెనక్కి జేరబడిన పార్థసారథి తన పక్కన సంచీ లేకపోయేసరికి గతుక్కుమన్నాడు. ఇటు చూసేడు. అటు చూసేడు. కనిపించలేదు. ఎంతసేపటినుంచి తాను షావుకార్నీ, అతడి జేబులోని పర్సునీచూస్తున్నాడో అంతసేపటినుంచీ తన సంచినీ, సంచీలోని పనికిమాలిన

పాతబట్టల మడతల్లో పనికొచ్చే పదిహేను రూపాయల్నీ చూస్తుండినట్లు అనిపించిన తన పక్క మనిషి ముఖం మాత్రం పార్థసారథి కళ్ళల్లో కనిపించింది. ఆ ముఖం తాలుకు మనిషి అంతకు ముందే రైలు దిగి జనంలో కలిసిపోయాడని అతనికి అర్థమయ్యేసరికి కొంతసేపు పట్టింది! అయ్యో నా సంచీ పోయింది అనబోయి గొంతు మరి పెగల్లేదు.

(ఆంధ్రజ్యోతి వీక్లీ, 2-3-1979)